ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు

మామిళ్లగూడెం, మార్చి 12 : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అదనపు కలెక్టర్, ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో 10,273 దరఖాస్తులు ధరణిలో పెండింగ్‌లో ఉండగా, మొత్తం 4,180 దరఖాస్తులు పరిష్కరించినట్లు, ఇందులో 2,496 దరఖాస్తులు ఆమోదించగా, 1,684 దరఖాస్తులు తిరస్కరణకు గురైనట్లు తెలిపారు. మిగులు పెండింగ్ దరఖాస్తులకు యుద్ధప్రాతిపదికన పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. దరఖాస్తుల పరిశీలనలో రికార్డులు ముఖ్యమని తెలిపారు. ప్రతి దరఖాస్తుకు ఈసీ ఉండాలన్నారు. లింక్ డాక్యుమెంట్లు పరిశీలించాలన్నారు. తొలగింపు ఉత్తర్వులకు డాక్యుమెంట్లు, స్పీకింగ్ ఆర్డర్లు, వివరణలతో సమర్పించాలన్నారు. టీఎం-33 మాడ్యూల్‌కు సంభందించి దరఖాస్తులు మొదటగా పరిష్కరించాలని, మాడ్యూళ్ల ప్రకారం దరఖాస్తుల పరిష్కారం సులువవుతుందని తెలిపారు. అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్‌సింగ్, యువరాజ్, ఖమ్మం ఆర్డీవో జి.గణేష్, ఎస్‌డీసీ రాజేశ్వరి, తహసీల్దార్లు, ధరణి ఓఎస్‌డీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'స్వీప్'ను పక్కాగా అమలు చేయాలి..

మామిళ్లగూడెం, మార్చి12 : జిల్లాలో స్వీప్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో స్వీప్ కోర్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత గల ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేలా చర్యలు చేపట్టాలన్నారు. కళాశాలల్లో అడ్మిషన్లు పొందిన 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు పొందేలా చూడాలన్నారు. హైస్కూల్, కళాశాలల్లో మాక్ పోల్ చేపట్టి విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. సీ-విజిల్ డౌన్‌లోడ్ చేయించాలని, ఇది వరకే చేసుకున్న వారి మొబైళ్లలో సీ-విజిల్ యాప్ ఉన్నదీ లేనిదీ పరిశీలించాలని తెలిపారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఎన్‌సీసీ కేడెట్లను ప్రతి కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణా సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, జిల్లా స్వీప్ నోడల్ అధికారి కె.శ్రీరామ్, డీఈవో సోమశేఖరశర్మ, కలెక్టరేట్ ఏవో అరుణ, సూపరింటెండెంట్లు మదన్‌గోపాల్, రాంబాబు పాల్గొన్నారు.

కలెక్టర్ వీపీ గౌతమ్



మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

క్రమబద్ధీకరణను త్వరగా పూర్తిచేయాలి

ఎల్ ఆర్ఎస్ లేఅవుట్ల పరిశీలనలో అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

చింతకాని, మార్చి 12: పెండింగ్‌ల ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి తదనంతరం క్రమబద్ధీకరణ పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. మండలంలో వందనం గ్రామ సమీపంలో వెంచర్లలో నమోదు చేసుకున్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను, సదరు భూములను ఆయా దరఖాస్తుదారులతో కలిసి మంగళారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎల్ ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానిక పంచాయతీరాజ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్, కార్యదర్శులు చెవుల మహేశ్, వినోద్, విజయరామారావు, ఈశ్వరాచారి, శివ, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

'ఉపాధి' పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలి

ఈజీఎస్ పనుల పరిశీలనలో డీఆర్‌డీఏ అదనపు పీడీ శిరీష

చింతకాని, మార్చి 12: పల్లెల్లో చేపట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని డీఆర్‌డీఏ అదనపు పీడీ శిరీష సూచించారు. కూలీలు కూడా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల కేంద్రమైన చింతకానిలో జరుగుతున్న ఎన్ఆర్ఈజీఎస్ పనులను మంగళవారం ఆమె స్వయంగా పరిశీలించారు. పనుల నిర్వహణ పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎండ తీవ్రత లేని సమయంలో ఉపాధి పనులను కొనసాగించాలని అన్నారు. ఉపాధి పని అడిగినన్ని రోజులూ ప్రభుత్వం పనులు కేటాయిస్తుందని తెలిపారు. అనంతరం ఉపాధి హామీ పనులపై ఎంపీడీవో కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బందితో సమీక్షించి పలు సూచనలు చేశారు. ఎంపీడీవో రేబెల్లి రామయ్య, ఏపీడీ శ్రీనివాస్, ఏపీవో కోటయ్య, కార్యదర్శి షేక్ సైదులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న అదనపు పీడీ శిరీష

దళితబంధు యూనిట్లు నెలకొల్పుకోనివ్వాలి

ఫ్రీజింగ్ తొలగించాలి.. తదుపరి నిధులను విడుదల చేయాలి..

చింతకానిలో దళితబంధు లబ్ధిదారుల పాదయాత్ర, ఆందోళన

చింతకాని, మార్చి 12: దళితబంధు ఖాతాల్లో ఉన్న నగదుకు ఫ్రీజింగ్ తొలగించి యూనిట్లు నెలకొల్పుకోవడానికి అవకాశం కల్పించాలని దళితబంధు లబ్ధిదారులు డిమాండ్ చేశారు. మధ్యలో నిలిచిన నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. దళితబంధు పథకాన్ని పూర్తిగా అమలు చేయాలంటూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నియోజకవర్గమైన ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం చింతకాని మండలంలోని పలు గ్రామాలకు చెందిన సుమారు 80 మంది దళితబంధు లబ్ధిదారులు మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు చింతకాని ప్రధాన కూడలి నుంచి స్థానిక ఎంపీడీవో కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం ఎదుట కొద్దిసేపు బైఠాయించి నినాదాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తమకు గత ప్రభుత్వం విడుదల చేసిన నిధుల చేసిన దళితబంధు నిధులు తమ ఖాతాల్లో ఉన్నాయని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ ఖాతాలకు ఫ్రీజింగ్ చేయడం వల్ల తాము వాటిని వినియోగించుకొని తదుపరి యూనిట్లు నెలకొల్పుకునే అవకాశం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవో రామయ్యకు వినతిపత్రం అందించారు. పలు గ్రామాలకు చెందిన దళితబంధు లబ్ధిదారులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఫొటోతో నిరసన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

టెన్త్ విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేత

కొణిజర్ల, మార్చి 12: మండలంలోని పెద్దగోపతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదోవ తరగతి విద్యార్థులకు సీవీ రామన్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, పెన్నులను హెచ్ఎం కే మార్కు, కళాశాల ఫిజిక్స్ లెక్చరర్ నరసింహారెడ్డి, నాగరాజు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, ఇస్మాయిల్, రమణ, నర్సింహారావు, శ్రీనివాస్, అంజనాదేవి, భాగ్యలక్ష్మి, శైలజ పాల్గొన్నారు.

మహిళా సదస్సుకు వెళ్లిన స్వయం సహాయక సంఘ సభ్యులు

కల్లూరు, మార్చి 12: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం సికింద్రాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన మహిళా సదస్సుకు ఐకేపీ ఏపీఎం వెంకటరామారావు ఆధ్వర్యంలో కల్లూరు నుంచి స్వయం సహాయక సంఘాల సభ్యులు తరలివెళ్లారు. ఉషోదయ మండల సమాఖ్య, పలు స్వయం సహాయక సంఘాల మహిళలు సదస్సుకు వెళ్లారు.

'రైతు నేస్తం'పై వీడియో కాన్ఫరెన్స్

కొణిజర్ల, మార్చి 12: మండలంలోని తనికెళ్ల రైతువేదికలో రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌ను మంగళవారం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ మంత్రి హైదరాబాద్ నుంచి రైతునేస్తం ప్రోగ్రాంలో పాల్గొని పలు సూచనలు చేశారు. డీఏవో విజయనిర్మల మాట్లాడుతూ ప్రతి మంగళవారం నియోజకవర్గం రైతులు తనికెళ్ల రైతువేదికకు వచ్చి నేరుగా హైదరాబాద్ శాస్త్రవేత్తలతో మాట్లాడి సాగు విషయాలు తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాసరెడ్డి, వైరా డివిజన్ ఏడీఏ సతీశ్, ఎంఏవోలు బాలాజీ, పవన్‌కుమార్, నర్సింహారావు, ఉమామహేశ్వరరెడ్డి, వాహిని, హార్టికల్చర్ ఏడీ అనిత, హెచ్‌వో వేణు, వైరా డివిజన్ నాలుగు మండలాల ఏఈవోలు , రైతులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన

పెనుబల్లి, మార్చి12: మండలంలోని వంగాముత్యాలబంజర గ్రామపంచాయతీ పరిధి కొత్తగూడెం రోడ్డులో గ్రామపంచాయతీ నిధుల ద్వారా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు మంగళవారం నాయకులు ప్రారంభించారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే మట్టా రాగమయికు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

30న 'రన్ ఫర్ జీసస్'

సత్తుపల్లి, మార్చి 12: గుడ్‌ఫ్రైడే అనంతరం ఈ నెల 30వ తేదీన జరుపతలపెట్టిన రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎన్‌సీసీ జాతీయ పొలిటికల్ వింగ్ అధ్యక్షుడు అలవాల కరుణాకర్, టీసీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎండీ సుదర్శనం అన్నారు. మంగళవారం ఎన్టీఆర్‌నగర్ క్రీస్తుసంఘం ప్రార్థనా మందిరంలో నేషనల్ క్రిష్టియన్ కౌన్సిల్, తెలంగాణ క్రిష్టియన్ కౌన్సిల్ నాయకులు నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సేవకులందరూ తమ తమ సంఘాలతో 30వ తేదీ ఉదయం 7 గంటలకు అంబేద్కర్ విగ్రహం వద్దకు రావాలని కోరారు. అనంతరం బిషప్ సుదర్శనంను సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గుర్రాల సత్యానందం, పింగలి సామేలు, పిల్లి రవికిరణ్, పాల్‌రాజ్, యేబు, వరప్రసాద్, ఐ.శ్రీనివాసరావు, దేవసహాయం, డానియేలు పాల్గొన్నారు.

విక్రమ్ ఆశయాలు సాధించాలి

వైరాటౌన్, మార్చి 12: సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకుడు విక్రమ్ దోపిడి సమాజానికి వ్యతిరేకంగా ప్రజా పోరాటాలు నిర్వహించారని, ఆయన ఆశయాలను సాధించేందుకు ప్రజలు ముందుకు రావాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకుడు సీవై పుల్లయ్య పిలుపునిచ్చారు. మంగళవారం వైరా విక్రమ్ వర్ధంతిని పార్టీ మండల కార్యదర్శి యలదండి బాబు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి కే అర్జున్‌రావు, నాయకులు పాశం అప్పారావు, తడికమళ్ళ సీతారాములు, కన్నెగంటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు సీతారామ ప్రాజెక్ట్ కాల్వ పనులకు శంకుస్థాపన

వైరాటౌన్, మార్చి 12: వైరా రిజర్వాయర్ సాగు, తాగునీరు అనుసంధానం కోసం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.100 కోట్ల నిధులతో వైరా రిజర్వాయర్ ఆనకట్ట వద్ద సీతారామ ప్రాజెక్టు కాల్వ పనులను బుధవారం శంకుస్థాపన చేస్తారని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ తెలిపారు. ఈ పనులను డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, భారీ నీటిపారుదల శాఖామంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేస్తారన్నారు. మంగళవారం రిజర్వాయర్ ఆనకట్ట వద్ద శంకుస్థాపన సభ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, నాయకులు, ఇరిగేషన్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

వ్యాసరచనలో త్రివేణి విద్యార్థి ప్రతిభ

ఖమ్మం ఎడ్యుకేషన్, మార్చి 12 : నగరంలోని త్రివేణి పాఠశాలకు చెందిన విద్యార్థిని బి.ఆరాధ్య భారతీయ తపాలాశాఖా నిర్వహించిన ధాయ్ ఆకార్ లెటర్ వ్యాసరచన పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి సాధించిందని ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. విద్యార్థినికి రూ.25 వేలు నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందించారన్నారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థినిని డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీళ్లు

వైరారూరల్, మార్చి12: మండలంలోని రెబ్బవరంలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ ఎక్కించే పైపు వాల్ ఫెయిల్ కావడంతో పది రోజుల నుంచి గ్రామానికి తాగునీరు అందక ప్రజలు అవస్థలు పడుతున్నారు. తాత్కాలిక మరమ్మతులు సక్రమంగా చేయకపోవడంతో నీరు వృథాగా పోతున్నాయి. మిషన్ భగీరథ అధికారులు స్పందించి మరమ్మతులు చేసి తాగునీటి సమస్య తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం ఎడ్యుకేషన్, మార్చి 12 : బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డీఎస్సీ ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు రూ.1500 బుక్‌ఫండ్, స్టడీ మెటీరియల్ అందించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ జి.శ్రీలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. WWW.TSBCSTUDYCIRCLE.CGG.GOV.IN వెబ్‌సైట్‌లో ఈ నెల 14వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 9573859598లో సంప్రదించాలన్నారు.

బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ శిక్షణకు..

జిల్లాలో డిగ్రీ పాసైన అభ్యర్థులకు హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో రెండునెలల నాన్ రెసిడెన్షియల్ ఉచిత శిక్షణకు ఈ నెల 25వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత తెలిపారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు..

డీఎస్సీ ఎస్జీటీ ఉచిత శిక్షణకు ఉమ్మడి జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని డైరెక్టర్ శ్రీలత సూచించారు. బీసీ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్‌లో ఈ నెల 22వ తేదీలోగా దరఖాస్తు చేయాలని, ఈ నెల 26వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభమవుతుందన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం

సత్తుపల్లి టౌన్, మార్చి 12: పట్టణంలోని అయ్యగారిపేట ఆంజనేయస్వామి ఆలయంలో వల్లభనేని లక్ష్మి కుమారులు వల్లభనేని ప్రవీణ్, పవన్ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొడ్డా హైమావతి, భక్తులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

వేంసూరు, మార్చి12: సుధా హెర్బల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మండలంలోని కందుకూరు ఎస్సీకాలనీలో 30 మంది వృద్ధులకు మంగళవారం దుప్పట్లను అందజేశారు. ఈ సందర్భంగా సుధా హెర్బల్ చారిటబుల్ ట్రస్టు ఫౌండర్, సనాతన ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ కొనకళ్ల సుధారాణి మాట్లాడుతూ వృద్ధాప్యం అంటే వయస్సు మళ్లడం కాదని, అది నిలువెత్తు అనుభవమని, వృద్ధులను ఆదరించాలన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

వేంసూరు, మార్చి12: మండలంలోని రాయుడుపాలెం సెక్షన్ పరిధిలోని అడసర్లపాడు, మొద్దులగూడెం, బీరాపల్లి, శంభునిగూడెం గ్రామాల్లో సింగిల్ ఫేజ్ 25 కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను మంగళవారం విద్యుత్ అధికారులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఏడీఈ ప్రసాద్‌బాబు, రాయుడుపాలెం సెక్షన్ ఏఈ అనిల్‌కుమార్, సబ్‌ఇంజినీర్ జిలానీ, లైన్‌మెన్ వెంకటేశ్వర రెడ్డి, జేఎల్ఎంలు రమేశ్, రవి పాల్గొన్నారు.

సర్వే నెంబర్ 1183 నిషేధిత జాబితా నుంచి తొలగించాలి

వైరాటౌన్, మార్చి 12: మున్సిపాలిటీ పరిధిలో సోమవరం రెవెన్యూలో సర్వే నెంబర్ 1183ను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం రైతులు తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. రాంబాబు మాట్లాడారు.నిషేధిత జాబితాలో ఉంచడం వల్ల రైతులు నష్టపోతున్నారని, బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో చలపతిరావు, హరి వెంకటేశ్వరరావు, పుచ్చకాయల రామయ్య, శ్రీనివాసరావు, మచ్చా మణి పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడిగా సతీశ్

రఘునాథపాలెం, మార్చి 12 : పీఆర్‌టీయూ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడిగా రఘునాథపాలెం మండలం మూలగూడెం గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లింగం సతీశ్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జిల్లా అధ్యక్షుడు మోతుకూరి మధు నియామక ఉత్తర్వులు జారీచేశారు. మండలంలో సంఘాన్ని బలోపేతం చేస్తానని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తానని సతీశ్ తెలిపారు.

బియ్యం వితరణ

రఘునాథపాలెం, మార్చి 12 : మండల పరిధిలోని చిమ్మపూడి గ్రామంలో అనారోగ్యంతో మృతిచెందిన నిరుపేద కుటుంబానికి ఉపసర్పంచ్ గుత్తా వెంకటేశ్వర్లు 50 కిలోల బియ్యం మంగళవారం వితరణ చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కాలంగి వీరబాబు, చర్ల సత్యనారాయణ, సచ్చు వీరబాబు పాల్గొన్నారు.

సీపీఎం నాయకురాలికి పరామర్శ

హైమావతిని పరామర్శిస్తున్న తాతా మధు

ఖమ్మం, మార్చి 12 : మూడునెలల క్రితం రోడ్డుప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న ఐద్వా రాష్ట్ర నాయకురాలు, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బత్తుల హైమావతిని మంగళవారం ఖమ్మంలోని వారి నివాసానికి వెళ్లి ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు తాతా మధుసూదన్ పరామర్శించారు. ఆమె కుమారుడు లెనిన్‌తో మాట్లాడారు. హైమావతి పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

పైనంపల్లి శ్మశాన వాటిక స్థల ఆక్రమణపై విచారణ

కూసుమంచి (నేలకొండపల్లి), మార్చి 12: నేలకొండపల్లి మండలం పైనంపల్లిలోని శ్మశాన వాటిక స్థలాన్ని కొందరు ఆక్రమించారంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి గ్రామస్తులు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు స్థానిక రెవెన్యూ అధికారుల మంగళవారం విచారణ చేపట్టారు. పైనంపల్లికి వెళ్లి స్థలాన్ని సర్వే చేశారు. వాటిల్లో ఆక్రమించిన వివరాల నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని స్థానిక అధికారులు తెలిపారు.

'ప్రజాపాలన' ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

జిల్లా పరిషత్ సీఈవో వినోద్

ముదిగొండ, మార్చి 12: ప్రజాపాలన దరఖాస్తుల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జడ్పీ సీఈవో వినోద్ సూచించారు. ముదిగొండలోని ఎంపీడీవో కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా సదర్శించారు. ప్రజాపాలన ఫిర్యాదుల కేంద్రాన్ని పరిశీలించి సిబ్బంది, లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈజీఎస్ కూలీల వివరాల గురించి, ప్రస్తుతం జరుగుతున్న పనుల గురించి ఏపీవోను అడిగి తెలుసుకున్నారు. కొత్త పనులు గుర్తించి కూలీల సంఖ్యను పెంచాలని, వేసవి దృష్ట్యా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభయ హస్తం పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎంపీడీవో శ్రీధర్ స్వామి, ఎంపీవో సూర్యనారయణ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ ఫలితాల్లో 'ప్రియదర్శిని' ప్రతిభ

ఖమ్మం రూరల్, మార్చి 12: జేఎన్‌టీయూ ప్రథమ సంవత్సర ఫలితాల్లో మండలంలోని ప్రియదర్శిని మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు సత్తా చాటారు. ఈ సందర్భంగా కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సదరు విద్యార్థినులను కళాశాల చైర్మన్ కాట్రపల్లి నవీన్ బాబు అభినందించారు. కళాశాల డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ, ప్రిన్సిపాల్ గోపాల్, శాఖాధిపతులు కుమారస్వామి, నరసింహరావు, రమేశ్, బ్రహ్మం, మంజూల, స్రవంతి, కీర్తి, రాణి తదితరులు పాల్గొన్నారు.

మోదీ దిష్టిబొమ్మ దహనం

మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

ఖమ్మం కమాన్‌బజార్, మార్చి 12 : వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం సీఏఏ అమలుకు కేంద్ర ప్రభుత్వం నిబంధనలను నోటిఫై చేయడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని సరితా క్లీనిక్‌సెంటర్‌లో మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్ అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్ మాట్లాడారు. సీఏఏ అమలు రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఎంఏ జబ్బార్, ప్రకాష్, సుదర్శన్, ఉపేందర్ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత

చింతకాని, మార్చి 12: మండలంలో నాగులవంచ, నామవరం, చిన్న మండవ, తిమ్మినేనిపాలెం తదితర ఉన్నత పాఠశాలల్లో చదువుకుంటున్న టెన్త్ విద్యార్థులకు భగవాన్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం పరీక్షల సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల హెచ్ఎంలు మాట్లాడుతూ టెన్త్ విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాక్షించారు. భగవాన్ సత్యసాయి సేవా సమితి జిల్లా కమిటీ సభ్యుడు ఆలస్యం నరసింహరావు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం

ఎర్రుపాలెం, మార్చి 12: మండల కేంద్రమైన ఎర్రుపాలెంలోని బీఆర్ఎస్ మండల కార్యాలయంలో పార్టీ మండలస్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు ఉదయం 10 గంటలకు పార్టీ కార్యాలయానికి చేరుకోవాలని కరారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లి రూరల్, మార్చి 12: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. మంగళవారం మండలంలోని రామానగరంలో రూ.31లక్షలు, యాతాలకుంటలో రూ.58లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపనలు చేశారు. చెరుకుపల్లి పంచాయతీ తురకలగూడెంలో రూ.5.8లక్షలతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల ప్రహరీని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి గ్రామాలను అభివృద్ధి చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్లు అర్హులైన లబ్దిదారులందరికీ అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కందుకూరు గ్రామంలో..

వేంసూరు, మార్చి 12: మండలంలోని కందుకూరు గ్రామంలో రూ.38 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను మంగళవారం ఎమ్మెల్యే మట్టా రాగమయి ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజు, ఎంపీవో రంజిత్‌కుమార్, ఎంపీడీవో నాగేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జయలక్ష్మి, నాయకులు గొర్ల వెంకటప్పరెడ్డి, శ్